# రక్తాక్షతలు

అమ్మయ్య! ఎన్ని ఆవడలో బరువు మోసినట్టుగా ఉండాది. నా ఒల్లే అంత బరు వనిపించిందెల్లే ఉండది. నా కాళ్లు ఒంటిని మొయ్యలేకపోతేనా! కాళ్లీడ్చుకుంటూ నడిశా. అసలు నేను నడిశానా? గట్టిగా నా జబ్బ పట్టుకుని నడిపిచ్చారు.

నడిసింది ఒక్క పరుగు నేలే గిందా? ఊళ్లు తిరిగి వచ్చినంత అలుపుగా ఉండాదిరా. దేముడా! తలకాయ తేలిపోతాఉండది. తల అదిమి పట్టుకోవాలి. చేతులెత్తాలే. ఊఁ, హు, చేతులు లెగటం లేదు. అమ్మ! ఎనక పీటిగా గోడ ఉండాది గనక సరిపోయింది. దానికి జారిగల పడేశారు. లేకుంటే పడి పోదును. కడుపులో యామిటో తిరుగు తుండట్టుగా ఉండాది, డోకు వస్తాదా, యాం? వస్తే ఎట్టా? ఇది అయ్యగారి కచేరీ సావిడిగిందా! పోనియ్యి. లెగిసి బయటికి ఎల్దామా అంటే లెగిశేదానికి కాళ్లు లెగవే. ఎట్టా నడిశానా అంట? అంటే, రెక్క పట్టుకున్నారుగా ఎవులో. వాల్లెవరు? కిష్టిగాడు. అవును, వాడల్లనేగా ఇంతదాకా ఒచ్చింది. వాడే పరిగెత్తుకుంటూ ఒచ్చాడు. వాడంటే అస లేనాడు నాకు గిట్టదే. మరి, వాడెట్టా ఒచ్చాడో? ఎందుకొచ్చాడో? అసలు వాణ్ణి సూస్తేనే, అరికాల్నించీ తలకెక్కుతాది – కోపం నాకు. ఆడికి ఆ కాకీలాగూ, సొక్కాయీ ఒకటి – పోలీసు ఓడికెల్లే. ఆ కుళ్ళాయి చెరువులో పని కెల్లినప్పటేల నించీ ఆ గుడ్డలే, ఏస్తాఉంటాడు.

అబ్బ! గాలి లేదు. ఉక్కిరి బిక్కిరి అవుతా ఉండాది. ఇక్కడెందు కింత జనం? కిట కిట లాడతా ఉండారే. ఎన్ని కాళ్లో!– అడుగులు శప్పుడూ, మాట్లూ

– అంతా ఏదో గందర గోళం, ఏదీ ఇవరంగా లేదు. ఆ పెళ్ళి జనం అంతా ఇటు బడ్డదెల్లే ఉండాది.

ఎక్కడో ఎవ్వళో అంటావుండారు గుంపులో నుంచి – "ఎంత అందమయిన పిల్ల ఆ మంగి!"

నిజం, ఎంత అందం. యాడాది ముందల నా పెళ్లినాటికి ఎట్టా ఉండాది! ఎంత బాగుండాది! ఆరోజునే పెళ్లికూతుర్ని చేశారు – పసుపు గుడ్డలూ, శెంపని గందం, ఒల్లంతా వలుపు, కొప్పులో ఇడిన మల్లిశేర్లు – గుమ గుమ లాడతా ఉండాది. నన్ను శూశి, శిలకెల్లె నవ్వింది, ఎవ్వళూ సూడకుండా. ఈ నాటికీ ఆ అందం తగ్గందే! నా పేణంతో సముంగా సూసుకున్నా నా మంగిని.

"కల్ల కపటం లేంది పాపం!"

"వాళ్లిద్దరూ మేనత్త మేనమామ పిల్లలేనటగా?"

ఎవులెవులియ్యో ఆ గొంతుకలు. నా శుట్టూ ఉండా గుంపులో నుంచీ ఇనపడతా ఉండాయి.

ఆ కిష్టిగాడికి సంతకం శేశేది వస్తాదిగిందా అనీ, మేనమామ కొడుకనీ, మంగిని పెళ్లాడుదామని ఎన్ని ఇందాల పన్నాగాలు పన్నాడు. "నీ అందానికీ, మంగి అందానికీ సరిపోతాదిరా. దాన్ని నీకే ఎట్టాగైనా మాట్లాడతాను." అంటూ మా అవ్వ కంకణం కట్టుకునె. ఇక నాకేమో అది పంచపాణాలేనయ్యె. పన్లోనుంచీ వస్తానే. నీలాటరేవు కేశి శూస్తానే ఒచ్చే ఓణ్ణి. సూపానేతలికే అంతమంది ఆ డోళ్ళల్లోనూ, అదే నా కంట బడేది. అది మాత్రం, యాంవంత తక్కువ శూపు శూశింది నన్ను? "నా మూగ బావ సత్తియ్యనే కట్టుకుంటా" నని ఎంతోమంది ఆ డోళ్లా ఈ డోళ్ళద్ద అందంట. ఇంత దాకా ఏలోటూ శెయ్యందే నాకది. అయితే ఆ కిష్టిగాడు నాకు పక్కలో బొకయిపోయె. ఆడికి ఆ సైకిలు ఒకటి. అది తొక్కుతా ఈలేసుకుంటా పోతాడు. అట్టా పోతా, "యాం పిల్లా, బాగుండావా?" అంటే, ఇది నవ్వటం ఎందుకంటా? నాకా అరికాల్లో మండి నడినెత్తి కొచ్చేది; తమాయించుకునే ఓణ్నే గాని, ఒక్కొక్క పాలి ఈళ్ళిద్దరి తంతూ శూస్తే ఏ నూతిలోనన్నా పడదామనిపిచ్చేది. మా అవ్వ కనిపెట్టేశిందిగా. "అళ్లు మేనరికంరా. కిష్టిగాడు ఆడోళ్ళని శూస్తే ఇకి

లిస్తాడు. అంతే, నువ్వు పట్టిచ్చుకోమాకు.'' అంటానే ఉండేది ఆవ బతికి ఉండి న్నాళ్ళన్నీ. అయినా మంగి ఎదురుపడితే వాడు అదోలాగా శూశే ఓడే. నాకు కళ్లు తిరిగేయి. మంగినే కట్టుకుంటానని ఆడు ఎంత మందర్ల అన్నాడు గాదు. ఆడు సైకిలుమీంచి పడి మంచంలో ఉండమట్టిగాని, లేకుంటే, మా అవ్వ ఎల్లి అడిగే తలికే, మంగి బాబు ఒప్పేసుకుంటాడా? ఆ పెద్ద దిక్కు దాని బాబైనా ఉండాడు గాదు. కొడుకద్దకి కలిదిండి సీమపోయె. నేనూ మంగీ దిక్కులేని ఓళ్ళ మైతిమి. దానికి నేనూ, నా కదీ అయ్యి ఇన్నాళ్ళూ బతుక్కొచ్చాం. ఇదిగీ నాడు గిట్టా అయ్యె!

ఇయ్యాల ఆ మాయదారి పెళ్ళికెందు కెల్లాలి ఇది? కిష్టిగాడు పెళ్ళికూడా' కాదే. అదేనా అయితే ఆ బెడద ఇరగడ అవును. వాడు ఆంబోతెల్లే పెళ్ళాడనంటా ఉంటేనా, – ఆడి శెల్లిలు పెళ్లి ఇది. దీని పెళ్ళికి ఆళ్లు ఏవంత లావు మర్యాదలు జరిపేరూ అంటా? అసలు మా పెళ్లి సుబంగా జరగకూడదని ఆడిఅమ్మేగా అన్నది. దాని కంట్లోనే బడ్డదిగా ఆ కోడిపిల్ల. పెళ్ళయ్యి, పసుపు తాడు, పలుపై మెళ్లో ఏసుకుని నిండు శింగారంతో పచ్చని పందిట్లో నుంచుని ఉంటే, యాం వైభవంగా ఉండాది నా మంగి! ఆ సంయానికే ఆగెద్ద మంగి పెంచిన ఆ కోడిపిల్లని తన్నుకు పోవాలా! అందరూ గోల గోల చేశేతలికి, ఆ పిల్లని కాస్తే కింద బడేశే ఆ గెద్ద. ఆ కోడిపిల్ల పేనం అప్పుడే పోయె. శటుక్కుని దూకి ఆ పిల్లని శేతనందుకుంది మంగి పిల్లంతా రత్తకొల్లు! మంగి పసుపు శెయ్యంతా నెత్తురైపోయె. దాని కళ్ళల్లో నీల్లు తిరిగినయి. ఎంత ఎన్నముద్ద సువంటి గుండెకాయ నా మంగిది. ఆ ఘణంలో నేనే దేముణ్ణైతే, ఆ కోడిపిల్లకి ఎంటనే ఊపిరి పోద్దామా, అన్నట్టు గనిపిచ్చింది నాకు. అట్టా దిగాలుపడి నిలబడ్డా కూడా. శూడ రొండు కళ్లు సాలవు అనిపిచ్చింది, నా మంగిని. ఆ శరీరం రంగు! – మా ఇళ్ళల్లో ఎవ్వలికీ లేదు గంతశేటు రంగు.

ఉప్పుదేంటి? శుట్టూ ఇంత గొడవగా ఉండాదే, అక్కడక్కడా ఏదో మాటలు ఇనబడతా ఉండాయి.

"అసలేం జరిగిందేం?" అంట్నూ ఉంటారు, ఎవ్వలో ఆ గుంపులో, ఆత్రంగా.

అసలేం జరిగింది? నాకు మాత్రం యాం ఎరక ? తల్చుకుంటే గుండె శెరువైపోతా ఉండాది. నేను రోజల్లా గొడ్డెల్లె కష్టపడి, బువ్వ తిని ఒస్తానని, అయ్యా

గారద్దశెప్పి, ఇక్కణ్ణించే బయలుదేరారా. దేముడా - గంపెడి ఆకలితో. ఎండ శంప మాడేస్తా ఉండింది. నెత్తిని గడ్డేసుకుని, అదేపనిగా, గూడెంలోకెల్లా, ఎలా ఉంటేనే, యాం సందడి! పిల్లలు పందిరి గుంజల్నుంచీ లేత కొబ్బరాకులు శింపి, బూరలు శుట్టుకుని. సంబరంగా, 'తుత్తూ' అని ఊదుకుంటా తిరుగుతున్నారు. మద్దినేల పొద్దు కాలిపోతా ఉండాది. ఈదెంట నడుస్తా ఉంటేనే, పెళ్ళిసందడి ఇన బస్తా ఉండాది. అట్టు పక్క సూడకుండానే తిన్నగా నడుశుకుంటా, ఈదెంటపడి, మా గుడిశ కాడికి ఒచ్చా. ఒస్తా ఉంటేనే, నా శెవుల్లో బడ్డది, నా మంగిగొంతుకు. నేను, అసలు, పెళ్ళికే సశేమి ఎల్లొద్దన్నానా? - వారం రోజులు ముందట్నుంచీ, శిలక్కి శెప్పినట్టా శెప్తానే ఉండా, నా యొద్ద సరే అని గంగిరెద్దల్లె తలకాయ ఊపె. నేను నమ్మితిని. ఇప్పుడు శుస్తేనేమో. పెళ్ళిలో గొంతుకు ఎత్తి పాడతా ఉండాది. కిన్నెర లాగా పాడతాది గిందా. అయ్యో దేముడా, ఆకిస్తిగాడు అక్కడే సస్తాడయ్యె. దీనికి యాంపని అక్కడికి? నాకు శివాలెత్తిపోయింది. దాని పాటా, దాని గొంతుకు ఇంకా ఇనాలనే ఉండింది నాకు, ఎట్టా - అక్కడ ఆగటం? ఇంతకీ, కిస్తిగాడు, అక్కడ ఇంటనే ఉండారుగా! ఎట్టా! యెంత శక్కంగా పాడింది.

"తట్టేదీ? బుట్టేదీ? గనమయినా''
ఉప్పారీ గడ పారేదీ ?
"... ... ... ... ... ..."
"శి ట్టేతా పళ్ళేయీ? పే రీతా పళ్ళేయీ?''
"... ... ... ... ... ..."

మల్లా, ఉప్పుడు ఇంటా ఉండట్టుగానే ఉండాది - శెవుల్లోనే ఉండాది, నా మంగి గొంతుకు.

దాని గొంతుకు శెవుల్లో మోగుతానే, మా ఇంటికేశి నడిశా. దాన్ని ఇంటికొచ్చాక నాలుగు తందామనుకున్నా. సరే, కడుపులో కాల్తా ఉండాది. తలమీద గుడ్డతీసి లోన కెల్లాను గిందా-కూడూ వండలే, కూరా వండలే. ఎక్కడ పాశికుండలక్కడే ఉండాయి. పొయ్యన్నా రాజబెట్టులే. నేను ఎండలో వచ్చానేమో, కళ్ళు తిరిగి పోయినయ్యి. ఇంక మతి లేదు. కోపం పట్టలేకుండా, బయటికి రొండ రుగుల్లో ఈదిలోకి ఒచ్చా. కిలాకిలా నవ్వుకుంటా, మంగి పరుగెత్తుకుంటా వస్తా ఉండాది. దాని ఎనకాలే, నవ్వుకుంటా, ఒల్లంతా వసంతంతో, కిస్తిగాడు తరుముకొస్తాఉండాడు.

నాకు ఒళ్ళు తెలవలే. శూపే అనలేదంటే పిచ్చెక్కిపోయింది, అసలు.

దగ్గరికి ఒచ్చిందాకా ఉండి బాదొచ్చుగిందా! అందాకా నా కోపం పట్టలేక పోయాను. నా చేతిలో ఉండా పొన్ను గ(ర, పూని, ఇసిరి ఏశా.

అంతే, రెప్ప ఏసే తలికి, ఆ క(ర ఏ ఆయువు పట్టుని తగిలిందో - అట్టానే పడిపోయింది, నా మంగి! నేను పరుగెత్తాను దద్దరికి. ఇక నంతే. నా కళ్ళల్లో పడ్డదల్లా, పడిపోయిన నామంగి. దాని శాశిన శెయ్యి నుంచున్న నా కాళ్ళదగ్గిరగా పడ్డది. దాని శెయ్యి గుప్పిడి ఒదిలింది. గుప్పిట్లోనుంచీ, తలం(బాలు జారినయి. శెయ్యంతా, ఎ(రగా, వసంతం, తలం(బాలు, వసంతంలో తడిశి ఎ(రబడ్డాయి. ఆ తలం(బాలు కూడా సల్లక ముందలే, కిష్టిగాడు. తరుం కొచ్చాడు, పెళ్లి సరసాల్లో.

అట్టాగే, కదలకుండా, మెదలకుండా, పడిపోయింది, నామంగి, ఎండలో.

అబ్బ! ఏం - ఇంత ఉడికిపోతా ఉండాదే, ఇక్కడ? అవును. శుట్టూ, మాడిపోతా ఉండాదే ఎండ. మంగిపైన యామన్నా నీడ పడేద్దామన్నా. నేను ఎల్లలేను గిందా! ఆకిరికి పాక్కుంటా ఎల్దామన్నా గాని. ఈ గుంపులోనుంచీ ఎట్టా? ఎల్లనిస్తారా? ఎవ్వళన్నా, ఏగోని గుడ్డన్నా కప్పరో లేదో గిందా, నా మంగి మీద.

ఎన్నిసార్లు అన్నానో దానితో, "నువ్వు ముందర సస్తే, నే నింక బతకలేనే,పిల్లా. నిన్ను పువ్వులూ బుక్కాయితో సాగనంపి, నేను, ఏ నుయ్యో, గొయ్యోసూసుకుంటా" నని. ఉప్పుడు ఇంక దాని కూడా ఎల్లేదానికి కూడా లేదే. ఎట్టా ఎల్లను? అయ్యో, దేముడా.నా మంగి ఎట్టా ఒంటరిగా ఎల్తాదో! కులం ఓళ్లు తీసుకెల్తారా? దాని ఓళ్లే, నేను, దాని కూడా ఉండకుండానే అది, పోతా ఉండాదే! గుండిలు కొట్టుకుంటా ఉండయి. ఆ కిష్టిగాడే అన్నీ చూసుకుంటా నన్నాడు. ఆకిరికి అడే సూసుకో వల్సి ఒచ్చిందా! నా మంగిని సాగనంపేది కూడా ఆడేనా! ఇదేం, తలరాతరా, దేముడా! అన్నట్టుగా, కిష్టిగాడు ఏడి? ఆడు మల్లా మంగి దగ్గిరికి ఎల్లాడెల్లే ఉండాది. "నేను సూసుకుంటా లెగరా," అన్నాడు, మంగి ఊపిరి అట్టా పోంగానే.

మంగి దెబ్బ తిని పడ్డది. జనం గుంపుగా నా శుట్టూ మూగారు. నాకు కళ్లు తిరిగి, పడిపో బుద్ధి ఏశింది అది గప్పుడే కిష్టిగాడు, ఒక్క అంగమీద ఒచ్చి, నా జబ్బ పట్టుకున్నాడు. "పద, అయ్యగారి కాళ్ళమీద బడేస్తాను, ఆయనే, రచ్చిస్తాడు," అన్నాడు.

"ఆడు చంపాలని చంపాడా, ఏం? ఆడి ఖర్మ అల్లా కాలింది గాని-'' అంటా ఉండారే. అదెవరు? లచ్చయ్యగారు ఆయన తోనే, ఇయ్యాల పొద్దున్న, ఏదో దుష్టులమాట ఒచ్చి, అయ్యగారు అంటా ఉండాది, "ఇంతవరకూ, హత్తె చేసినో డెవ్వడో నా ఎదుట పడనూ లేదు. నన్ను ముట్టుకోనూ లేదు," అని పొద్దు తిరగలేదు. నేను ఒచ్చి కాళ్లు సుట్టేసుకుంటివి. అయ్యో, ఆయన ఏమను కున్నారో? ఎంత ఛీ, ఛీ అనుకున్నారో, నన్ను శూశి? ఎంత పాపినయి పోయానురా, దేఁముడా!

ఇదేం - నా శుట్టూ గందరగోళం శటుక్కున తగ్గిందేం? మాట్లు ఇనుపట్టం లేదే ? ఏంటో సన్నటి శబ్దం. ఎపుడో ఇన్నట్టుగానే ఉండాది. మట్టెలు అమ్మగారి కాలు మట్టెలు. అయ్యిగో, నా కళ్ళముందర, పసుపుతో, రెండు పాదాలు, ఆగినయి.

"నీకు బయంలేదు సత్తులూ భయపడకు, మే మంతా నిన్ను కాపాడతాం. తెలియక చేసిన పాపం, దేవుడైనా క్షమించాలి కొంచెం ధైర్యంగా ఉండమ్మా," అమ్మగారి సన్నని గొంతుకు, తల ఎత్తలేను. ఆఁమొకం నా కగపట్టం లేదు.

ఇంకా రెండు పాదాలు. అదెవులు? దగ్గరికి ఒస్తావుండయి. ఇయ్యి పెద్దయ్యి. అమ్మగారి పాదాల పక్కన నిలబడ్డయి. అయ్యగారు, ఈ నాలుగు పాదాలకేగా దణ్ణంపెట్టి, ఎల్లాం, పెళ్ళిరోజున - పసుపు గుడ్డలతో, బెమ్మముళ్ళేసుకుని, నేనూ మంగీని. ఏడాది తిరగలే.

"కొద్ది శిక్షతోనే తప్పించడానికి ప్రయత్నిస్తాను. దురదృష్టవంతుడా. కోర్టు ఖర్చులుకన్నీ మేమున్నాంలే. దిగులు పడకు. భగవల్లీల,'' అయ్యగారి మాటలు.

"దేవుణ్ణి తల్చుకోరా!'' పెద్దమ్మగారు. అయ్యగారి తల్లి. "ఏ ఘడియకేమో గదా!" ఆఁవ గొంతుకే అది.

ఎంత దయ అందరికి! ఏంటో, గొళ్లున ఏడవాలని ఉండది. ఏడుపు రావటం లేదు. గొంతుకలో కాయలాగా యాంటో అడ్డం పడ్డది. కాయగాదు. అది దప్పిక. అబ్బ! మాట రాటంలేదు. దప్పిక్కి అడగాలంటే కూడా అడగ బుద్ధికాటం లేదు.

నా మంగీ! ఇంకెక్కడిది, నాకు మంగి!

"ఇదిగోరా, సత్తులూ, ఉడుకు గంజీ సల్లా కలిపి, ఉప్పేశి, తెచ్చాను. తాగు.

ఎండదెబ్బ తీరిపోతాది. యాలమీ బయ్యెం లేదురా. ఆ బగవంతుడు, నీ రాత ఇట్టా శేశాడు." ఎవ్వళి దా ముశిలి గొంతుకు? నాతల ఎత్తుతుండా రెవ్వళో. ఇట్టా శేశాడు." ఎవ్వళి దా ముశిలి గొంతుకు? నాతల ఎత్తుతుండా రెవ్వళో. ముశిలిశేతులు – మా అవ్వశేతుల్లాగా తగుల్తా ఉండాయి. పద్దాలు, అమ్మగారి పని మనిషి. యెంత కనికారం ఆడెకి కూడా. నన్ను మా బాగా శూశింది పద్దాలు. మంగి అన్నా కూడా పేణమే ఆడెకి. నోట్లో పోస్తాది గావోల్ను. అరె! నోరు బలిమిని తెరుస్తా ఉండాది. సల్లపోస్తా ఉండాది. గొంతుకలో గుటక అడ్డం పడ్డది. నెప్పిగా ఉండాదే..... .... .....

అమ్మయ్యా! పున్నెశాలి! ఆ యమ్మ కడుపులో పుట్టాల్సింది. అమ్మ... కడుపులో సల్లగా ఉండాది.

నా మంగి ఎండలో ఒంటరిగా పడి ఉండాది. దాని గతి ఎవ్వళు శూశారు? మెల్లిగా లేశి, ఎల్లి ఒస్తా మంగి అద్దకి. అనుకున్నట్టుగా నేను సాగనంప ఒద్దా?

అయ్యో! యాం, ఇంత మగతగా ఉండాదే? తల బరువు. పడిపోతా ఉండది. శెవుల్లో గింయ్‌య్... మంటూ వుండది. శుట్టూ తూగోల. ఇట్టా ఒడ్డి గిల్తా. కాశ్శేపు అయ్యాక, లెగిశి ఎల్తా, మంగి కాడికి. అసలు కదల బుద్దికాటం లేదే!

యాంటి అది? టప్, టప్, అంటా ఉండాది? అది యాఁమిటంయి ఉంటాంది?

ఇంతమందీ, ఒక్క పాలే, ఎందుకు ఇంత పెద్దగా అరుస్తా ఉండారు? "తప్పుకోండి! తప్పుకోండి." అరుపులు. ఎంత గాబరాగా అరుస్తా ఉండారు, జనం! "ఒచ్చారు, ఇన్నిస్ పిక్టరుగారు! ఇన్నిస్ పిక్టరుగారు ఒచ్చేసారు."

ఆం!... ... .... .... .... నా కోసం, నా కోసమే!

నా మంగిని ఒదిలి ఎల్లిపోవాలా! భగవంతుడా!

✤ ✤ ✤